క్లుప్తంగా

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

మాచర్ల రూరల్: మండలంలోని కొత్తపల్లి, కొప్పునూరు, అలుగురాజుపల్లి గ్రామాల్లో శనివారం సంఘ సభ్యులు ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. సంఘ నాయకుడు జె. గంగాధర్‌బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఎస్టీయూ నిరంతరం శ్రమిస్తోందని తెలిపారు. సంఘాన్ని బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులంతా సభ్యత్వాన్ని తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు షేక్ సిలార్ అహ్మద్, జబ్బార్, మధుసూదనరావు, ఫ్రాంక్లిన్, టి. రాజశేఖర్, నాయక్, హెచ్ఎం ఐ.వి. నాగమణి, నాగరాజు, శ్రీను నాయక్, బాలు నాయక్, కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాచర్ల ఎంపీడీవోగా సరోజినీదేవి



మాచర్ల రూరల్: మాచర్ల ఎంపీడీవోగా కె. సరోజనీదేవి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె ప్రకాశం జిల్లా మార్కాపురం ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

చవితి ఉత్సవాలలో డీజేలు నిషేధం



దుర్గి: వినాయక చవితి మండపాలలో డీజేలను ఏర్పాటు చేవద్దని కారంపూడి సీఐ దారా జయకుమార్ నిర్వాహకులకు సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటు చేస్తున్న వినాయక విగ్రహాలకు తప్పనిసరిగా నిర్వాహకులు అధికారుల నుంచి అనుమతి పొందాలని తెలిపారు. పోలీసుల అనుమతితోనే మైక్ సెట్టింగ్, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్ని ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. పోలీసుల నియమ నిబంధనల్ని అతిక్రమించి, ప్రజలకు అసౌకర్యంగా ప్రవర్తించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పార్టీ జెండాలు, పాటలను ఉపయోగించి ఉద్రిక్తత వాతావరణాన్ని సృష్టించే వారిపైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఎస్ఐ ఎం. శివ, సిబ్బంది పాల్గొన్నారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి



గురజాల: వినాయకచవితి పురస్కరించుకుని ఏర్పాటు చేసే మండపాలకు పోలీసుల నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ అశోక్ బాబు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దరఖాస్తులో మండపం ఏర్పాటు చేసే స్థలం, కమిటీ సభ్యుల వివరాలు, నిమజ్జనం స్థలాన్ని క్షుణ్ణంగా తెలియజేయాలని సూచించారు. ఉత్సవాల్లో విద్యుత్ వినియోగానికి ఆ శాఖ అధికారుల అనుమతులు ఉండాలని తెలిపారు. విగ్రహం ఎత్తు, ఊరేగింపు రూట్ మ్యాప్ తెలియజేయాలని కోరారు. అనుమతులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

రజకులకు ఏబీఎన్ చానల్ క్షమాపణ చెప్పాలి

దుర్గి: రజకుల గురించి అసభ్యంగా మాట్లాడిన టీడీపీ మహిళా కార్యకర్త సంభాషణల్ని లైవ్ టెలికాస్ట్ ద్వారా ప్రచారం చేసి పైశాచిక ఆనందం పొందుతున్న ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఎండీ రాధాకృష్ణ క్షమాపణ చెప్పాలని రజక సంఘాల ఐక్యవేదిక మండల నాయకులు డిమాండ్ చేశారు. రజక సంఘాల నాయకులు శనివారం మాట్లాడుతూ టీడీపీ నేత చంద్రబాబు అరెస్టుపై మహిళా పెయిడ్ ఆర్టిస్టు చాకలి అని సంబోధిస్తూ, అసభ్యంగా మాట్లాడుతున్నా అభ్యంతరం తెలపకపోవడం దారుణమని ఖండించారు. ఆయా ప్రచారాలను పదేపదే టెలికాస్ట్ చేస్తున్న ఏబీఎన్ ఎండీ రాధాకృష్ణ జర్నలిజంలో ఎలా ఉన్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో నంబర్ 504 ప్రకారం చాకలి అనే పదాన్ని నిషేధించి, రజకుల ఆత్మగౌరవాన్ని సీఎం జగన్ కాపాడారని తెలిపారు. ఆ పదాన్ని వాడితే నేరం కింద పరిగణించాలని ప్రభుత్వం జీవోలో పేర్కొన్నా ఏబీఎన్ చానల్ ప్రచారం చేయడాన్ని ఖండించారు. తమ మనోభావాల్ని కించపరచిన రాధాకృష్ణపై చట్టప్రకారం చర్యలు తీసుకొని, బహిరంగంగా రజక జాతికి క్షమాపణ చెప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.సమావేశంలో రజక సంఘం నాయకులు ముటుకూరు శివ, నాగేంద్ర, లక్ష్మీనారాయణ, వేముల పున్నారావు, బి. అంజి, బ్రహ్మం, వెంకటేశ్వర్లు, హనుమంతు పాల్గొన్నారు.

నేడు విశ్వకర్మ జయంతి

మాచర్ల: విశ్వబ్రాహ్మణుల ఆరాధ్య దైవం విశ్వకర్మ జయంతిని ఆదివారం పట్టణంలోని పాత మాచర్లలో ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు కె. నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని విశ్వబ్రాహ్మణ సంఘ పెద్దలు కోరారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో ప్రతి కుటుంబానికీ రక్ష



మండాదిలో బీపీ చెక్ చేస్తున్న సచివాలయ వైద్య సిబ్బంది



మాట్లాడుతున్న పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

రెంటచింతల: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రతి కుటుంబానికీ రక్ష అని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో శనివారం ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలని ఆమె సూచించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సమస్యల్ని తెలుసుకోవాలని చెప్పారు. ఎలాంటి వైద్యసహాయం కావాలో, ఏఏ మందులు అవసరమో కూడా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, సీహెచ్‌వో పూజల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటి దగ్గరే వైద్యం

వెల్దుర్తి: పేద ప్రజలకు ఉచితంగా ఇంటి వద్దే వైద్యాన్ని అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. మండలంలోని మండాదిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా 15 రోజుల పాటు ఏఎన్ఎం, సీహెచ్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి, ఆరోగ్య విషయాలు నమోదు చేసుకొని వారికి మందులు ఇస్తారని చెప్పారు. అనారోగ్యం ఉన్నవారికి టోకెన్ తయారు చేసి శిబిరం తేదీ, స్థలం వివరాలు తెలియజేస్తారని పేర్కొన్నారు. ఆ రోజు వారు శిబిరానికి హాజరుకావాలని తెలిపారు. ఏఎన్ఎంలు యాప్ ద్వారా అనారోగ్యంగా ఉన్న వారి బయోమెట్రిక్ తీసుకోవాలని ఆయన సూచించారు. క్లస్టరులో ఇళ్లను చూపించడానికి వారితో వలంటీరూ ఇంటింటికీ వెళ్తారన్నారు. వలంటీర్లు ఈ 15 రోజుల్లో రెండుసార్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పిడుగురాళ్ల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు చెప్పారు. పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి మీటింగ్ హాలులో శనివారం వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఇల్లూ ఆరోగ్యంతో కళకళలాడాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఆయన అడుగుజాడల్లో అంతా నడవాలని తెలిపారు. ఆరోగ్యశ్రీ గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో ఆరోగ్య శిబిరాల్ని నిర్వహిస్తామని తెలిపారు. క్లస్టర్ పరిధిలోని వారంతా హాజరయ్యేలా వలంటీర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్య సమస్యల్ని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కొమ్ము ముక్కంటి, షేక్ జైలాబ్దీన్, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.



రెంటచింతల పీహెచ్‌సీలో మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

ప్రజాస్వామ్యంలో న్యాయవాదులది ప్రధాన పాత్ర



న్యాయవాదులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మాచర్ల: ప్రజాస్వామ్యంలో న్యాయవాదులది ప్రధాన పాత్ర అని లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు అధ్యక్షుడు విడేల శ్రీనివాసరావు పేర్కొన్నారు. పట్టణంలోని చక్రధర్ డిగ్రీ కళాశాలలో శనివారం న్యాయవాదుల దినోత్సం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి న్యాయవాది ఇరువైపులా పూర్తి సమాచారాన్ని తెలుసుకొని న్యాయం వైపు ఉండాలని సూచించారు. న్యాయవాదులు కుర్రి సాయి మార్కొండారెడ్డి, సీహెచ్. నాగిరెడ్డి మాట్లాడుతూ వృత్తిపై న్యాయవాదులంతా అంకితభావంతో ఉండాలని సూచించారు. పేదలకు తమ వంతు సహాయసహకారాలందించాలని తెలిపారు. సమస్యల్ని పరిష్కరించేందుకు న్యాయస్థానాలు ఎప్పుడూ ముందుంటాయని చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు సెక్రటరీ షేక్ సికిందర్, అధ్యాపకులు వెంకటేష్, నవీన్, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో గురుకుల కళాశాల విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులతో ప్రిన్సిపాల్ మేరి మంజుల, ఉపాధ్యాయినులు

విజయపురిసౌత్: స్థానిక అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థినులు అచ్చంపేటలో జరిగిన రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మేరి మంజుల శనివారం తెలిపారు. అండర్–17 46 కేజీల విభాగంలో ఆర్. గాయత్రి ప్రథమ, 65 కేజీల విభాగంలో మెర్సీరోజ్ 5వ స్థానం, 49 కేజీల విభాగంలో పి. జ్యోతి ద్వితీయ, 53 కేజీల విభాగంలో ఆర్. అనూష తృతీయ, 57 కేజీల విభాగంలో సాగర్ దివ్య నాలుగో స్థానం సాధించారని ఆమె వెల్లడించారు. అండర్–14 36 కేజీల విభాగంలో వి. షివన్య, 42 కేజీల విభాగంలో బి. కీర్తి ప్రథమ స్థానం సాధించారని పేర్కొన్నారు. వీరంతా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులను పీడీ బీబీ, ఉపాధ్యాయినులు అభినందించారు.

స్కూల్ గేమ్స్ సెలక్షన్లకు స్పందన



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు

పిడుగురాళ్ల: గ్రామీణ క్రీడాకారులు, విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడం కోసం ప్రభుత్వం స్కూల్ గేమ్స్ సెలక్షన్లు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ అల్లు సత్యవతి, ఎంఈవో వై. శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి హైస్కూలులో శనివారం స్కూల్ గేమ్స్ సెలక్షన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ స్థాయి క్రీడాకారులు జాతీయ స్థాయిలో అడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ గేమ్స్ సెలక్షన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీలకు 15 పాఠశాలల నుంచి 250 మంది హాజరయ్యారు. అండర్- 14, అండర్- 17 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, యోగా, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించారు. ఎంపికల్లో 25 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, మండల కో- ఆర్డినేటర్ కె. దానియేలు, వ్యాయామ ఉపాధ్యాయులు మోహన్, సౌజన్య, శివరామకృష్ణ, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

17 నాటికి ఓటర్ల జాబితా పెండింగ్ పనులు పూర్తి చేయాలి

యడ్లపాడు: ఈనెల 17 నాటికి ఓటర్ల జాబితా పెండింగ్ పనులు పూర్తి చేయాలని చిలకలూరిపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి జి. వసంతబాబు చెప్పారు. యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబిత రూపకల్పనపై బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాబితా సవరణలో తప్పొప్పులు దొర్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఫారం -6 ఇచ్చిన కొత్త ఓటర్లును గుర్తించి చేర్చడంతో పాటు , ఫారం -7 ద్వారా మృతి చెందిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించాలని తెలిపారు. ముఖ్యంగా ఫారం -8 తాలూకు పేర్లు, అడ్రస్, డోర్‌నంబర్లు ఇతరేత్ర మార్పులు, చేర్పుల్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జాబితా పూర్తి పెండింగ్ వ్యవహారాన్ని ఈనెల 17వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ శ్యామలత, ఆర్ఐ చక్రవర్తి, సీనియర్ సహాయకులు మోజేష్, రెవెన్యూ సిబ్బంది, 57 మంది బీఎల్‌వోలు పాల్గొన్నారు.



గన్నవరం ఎంపీపీ స్కూలులో మట్టి విగ్రహాన్ని తయారు చేసిన విద్యార్థులు



మంచికల్లు ఎంపీపీ స్కూలులో మట్టి వినాయకుని విగ్రహాన్ని తయారు చేసిన విద్యార్థినులు

మట్టి విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడదాం

పర్యావరణానికి ముప్పు కలిగించేలా కెమికల్స్‌తో తయారు చేసిన విగ్రహాలను వినియోగించవద్దని, పర్యావరణహితంగా పూజలు చేస్తే ప్రకృతికి రక్షణ కల్పించినవారవుతారని పాఠశాల విద్యార్థులు ప్రచారం చేస్తున్నారు. స్కూళ్లలో మట్టి వినాయకులను తయారు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వద్దు అంటూ మండలంలోని కంభంపాడు, గన్నవరం, రాయవరం ఇతర గ్రామాల పాఠశాలలోని విద్యార్థులు మట్టి విగ్రహాలను తయారు చేసి గ్రామస్తులకు అందిస్తూ ఆకర్షిస్తున్నారు. – మాచర్ల రూరల్

పర్యావరణ పరిరక్షణతోనే ఓజోన్ పొరకు రక్షణ

కారెంపూడి: అంతర్జాతీయ ఓజోన్ ఆవరణ పరిరక్షణ దినోత్సవాన్ని స్థానిక ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం నిర్వహించారు. ఓజోన్ పొరతోనే మానవ జాతి మనుగడ, జీవితం ఆధారపడి ఉందని, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాలని తెలిపారు. పర్యావరణానికి హాని చేసే రసాయనాలు, ఇతర ఇంధనాల వినియోగాన్ని తగ్గిద్దామని సందేశమిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల నుంచి ఆదినారాయణ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్. నయోమి, ఉపాధ్యాయులు మాట్లాడుతూ సూర్యుని నుంచి వచ్చే అతి నీలలోహిత కిరణాలు నేరుగా భూమిపై పడకుండా ఓజోన్ పొర అడ్డుకుంటూ ప్రాణకోటికి జీవానిస్తోందని తెలిపారు. ఓజోన్ పొరకు రంధ్రం పడిందని శాస్త్రవేత్తలు గుర్తించిన నాటి నుంచి దాని పరిరక్షణ కోసం ప్రత్యేకంగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని వివరించారు.

క్లోరో ఫ్లోరో కార్బన్ల వాడకాన్ని నిషేధించాలని, భూ తాపాన్ని తగ్గించేందుకు చెట్లు పెంచాలని తెలిపారు. అడవుల శాతాన్ని భూ భాగంలో 33 శాతానికి పెంచాలని, నివాస ప్రాంతాల్లో కూడా 33 శాతం ఖాళీ స్థలంలో మొక్కలు పెంచేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. వినాయక చవితి వేడుకల్లో కూడా మట్టి గణపతినే పూజిద్దామని ప్రదర్శనలో విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు.

కారెంపూడిలో 383 మందికి వైఎస్సార్ కాపు నేస్తం

కారెంపూడి: కాపుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని వైఎస్సార్ సీపీ కారెంపూడి పట్టణ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య శనివారం పేర్కొన్నారు. వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా మండలంలో 45 నుంచి 60 ఏళ్ల లోపున్న 383 మంది పేద కాపు మహిళలకు వరుసగా నాలుగో ఏడాది లబ్ధి చేకూరిన సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేశారు. కాపులలో పేద కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ముఖ్యమంత్రి సంకల్పించి, ఏటా ఒక్కో కుటుంబానికి రూ.15 వేల చొప్పున ఆర్థిక చేయూతను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

దాచేపల్లి : సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని డీడీఏ శివకుమారి తెలిపారు. దాచేపల్లిలో శనివారం పొలంబడిని నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీఏ మాట్లాడుతూ పంటలో శత్రు, మిత్ర పురుగుల నిష్పత్తిని చూసుకుని మాత్రమే పురుగు మందులు వాడాలని సూచించారు. పొలం పరిసరాల్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, పంటలో పురుగుల ఉధృతిని గమనించి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం వేపగింజ కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏవో డి. పాపకుమారి, డాక్టర్ రమేష్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కారిడార్ భూములకు పరిహారం చెక్కుల పంపిణీ



రైతులకు చెక్కుల్ని పంపిణీ చేస్తున్న ట్రాన్స్‌కో ఏఈ అవినాష్

యడ్లపాడు: సుదీర్ఘకాల పోరాటం తర్వాత ట్రాన్స్‌కో విభాగం రైతులకు పరిహారాన్ని చెల్లించింది. వివరాల్లోకి వెళితే..2017వ సంవత్సరంలో సత్తెనపల్లి 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ప్రత్తిపాడు 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు 35 కి.మీ. మేర ప్రత్యేక విద్యుత్ లైన్‌ను ట్రాన్స్‌కో ఏర్పాటు చేసింది. పలు గ్రామాలతో పాటు యడ్లపాడు మండలం లింగారావుపాలెం పరిధిలోని 42 మంది రైతుల పొలాల మీదుగా వెళ్లింది. పనులకు ముందే కారిడార్ భూములకు పరిహారం చెల్లించాల్సి ఉన్నా, గత ప్రభుత్వం అలసత్వంతో నేటికీ ఆయా గ్రామాల రైతులకు అందలేదు. దీంతో పరిహారం కోసం లింగారావుపాలెం రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కేసు తుది విచారణకు రాకముందే ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించారు. ఈనేపథ్యంలో శనివారం లింగారావుపాలెం గ్రామంలో బాధిత రైతులకు కారిడార్ భూముల పరిహారం చెక్కుల్ని అందజేశారు. ఎకరాకు ఆ ప్రాంతంలో ఉన్న భూమి రిజిస్ట్రేషన్ విలువలో 10 శాతం నష్టపరిహారం చొప్పున చెల్లించారు. కారిడారు కింద 18 ఎకరాలు కోల్పోగా ఒక్కో ఎకరాకు రూ.1,15,000 చొప్పున 46 మంది రైతులకు రూ.20.70 లక్షల పరిహారం చెక్కుల్ని ట్రాన్స్‌కో ఏఈ అవినాష్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ ఏ ప్రాజెక్టు కింద రైతుల భూమి పోయినా ముందుగానే బాధితులకు పరిహారం చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోనందునే రైతులు ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. రైతు సంఘం ఆధ్వర్యంలో వారంతా న్యాయస్థానాన్ని ఆశ్రయించారన్నారు. మిగిలిన గ్రామాల రైతులకు కూడా ఇదే విధంగా పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు గోగడ హరిబాబు, ఆలోకం సుబ్బారావు, నంబూరి శివరామకృష్ణ, తోకల కోటేశ్వరరావు, జరుగుల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.